

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 20 ఫిబ్రవరి 24 సంచిక : 9

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
2 సంవత్సరాలకు చందా.........రూ॥200/-
10 సం.రాలకు చందా........ రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565

Online Donations :
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code : SBIN 0020639**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........................................ 2
శ్రీ సాయి నిత్య పారాయణ ............. 6
శాశ్వత ధర్మగోప్త ............................ 8
సాయిభక్త దాసగణు ........................ 10
పరమాత్మ దివ్యనామం .................... 13
బాబా అంటే అర్థం ........................... 15
ఊపిరి ఉన్నంతవరకే ........................ 18
మాతృసంస్థ కబుర్లు ........................ 23
ఆశ్రమ భిక్ష........................................ 26
జ్ఞానోదయమే జీవనసాఫల్యము 27
బాలవాణి ......................................... 30


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



మనం దేవాలయాలు నిర్మించుకొంటున్నాం. ఎన్నెన్నో సేవా సంస్థలు స్థాపించుకొంటున్నాం. గుడులైనా, సంస్థలైనా, మానవ కళ్యాణం కోసం నిర్దేశింపబడేవే. సామాన్య జనులు దేవాలయంలోని విగ్రహాన్ని సాక్షాత్తు భగవంతుడిగా తలుస్తారేగానీ బొమ్మగా భావించరు. అలాగే ప్రతి సేవా సంస్థ దాదాపుగా ఏదో ఒక దైవాన్ని ఆశ్రయించుకొనే ఉంటాయి. ఎక్కడో ఒకటి రెండు తప్ప. వీటన్నిటి పోషణ కోసం భక్తులే ఆధారమౌతుంటారు. వారు గుడికి ఇచ్చిన ప్రతి పైసా, ప్రతి వస్తువు దైవం పేరిటే సమర్పించు కుంటారు. కనుక అదంతా దైవ ద్రవ్యమే అవుతుంది. ఆ దైవ ద్రవ్యాన్ని, గుడిని నడుపుతున్న వారుగానీ, పూజాదికాలు నిర్వహిస్తున్నవారు కానీ, తమకు ఎంత అవసరమో లేదా ఎంత నిర్ణయింపబడిందో అంతవరకే దైవ ద్రవ్యాన్ని ఉపయోగించుకోవాలి. అలా కాకపోతే పాపాన పడిన వారవుతారు.

రామాయణంలో ఒక కథ ఉన్నది-ఒకసారి ఒక కుక్క రాజా స్థానానికి వచ్చి తనకు న్యాయం కావాలని మొరపెట్టుకొన్నది. మానవవాక్కులతో శ్రీరాముడు దానికి జరిగిన అన్యాయాన్ని వివరించమన్నాడు. "అయ్యా! నేను ఒక బ్రాహ్మణుడి ఇంటి ముందు నుండి నడుస్తుంటే అతడు నన్ను నిష్కారణంగా రాతితో కొట్టి గాయపరిచాడు. అతనిని శిక్షించి నాకు న్యాయం చేయండి" అన్నది గ్రామసింహం. ఆ స్థానంలోని న్యాయవేత్తలంతా ఒకరి మొగం ఒకరు చూసుకున్నారు. అప్పుడు శ్రీరాముడు "నీవు మాటలు నేర్చిన దానివే కాక-ధర్మవేత్తవులాగా కూడా తోస్తున్నావు. అందుచేత ఏమి

శిక్ష విధించాలో నీవే చెప్ప" అన్నాడు. కుక్క ఆ బ్రాహ్మణుడికి ఫలానా గుడిలో అధిక పదవి ఇమ్మన్నది. "శిక్ష వేస్తానని ఉద్యోగం చూపిస్తానంటా వేంటీ" అని అడిగాడు రాముడు. దానికి ఆ కుక్క ఫక్కున నవ్వింది. "మహారాజా, గత జన్మలో నేను అక్కడ అదే పనిచేసాను. పొరపాటున దైవ ద్రవ్యం తిన్న పాపానికి ఇప్పడే జన్మ వచ్చింది. ఇప్పడు ఇతన్ని కూడా అదే పనిలో పెడితే దైవద్రవ్యం ఆరగించి ఇప్పడు నేనున్న స్థితికే వస్తాడు. అదీ సంగతి" అన్నది. సాయిబాబా వారు ఒకసారి తన చెంతకు వచ్చిన షాపూర్జీ వాడియాతో "నీవు ఇంతకుముందే నాకు మూడు రూపాయల పధ్నాలు గణాలు ఇచ్చావు. ఇక మిగిలిన ఒక రూపాయీ రెండణాలు ఇస్తే సరిపోతుంది" అని అంతవరకే తీసుకున్నారు. అంటే తనకెంత రావాలో అంతే తీసుకుంటారు యోగులు. సామాన్యులు పక్కవాడి సొమ్ము కూడా తమకే కావాలనుకుంటారు. ఇక ఇంకా కొందరు అసామాన్యులు మాత్రం దైవ ద్రవ్యాన్ని-అసలు ద్రవ్యాన్నేమిటీ, గుడినీ గుడిలో లింగాన్ని కూడా దిగ మ్రింగుదామనుకుంటారు. పురాతన శిల్పాలు పరదేశాలకు అమ్ముకోవడం, దేవుడి నగలు కరిగించుకొని తాగేయడం, దేవుడి మాన్యపు భూములన్నీ గుటకాయ స్వాహా చేయటం, చివరికి ధూప, దీప, నైవేద్యాల కోసం కేటాయించిన డబ్బు కూడా తమకే ముడుపుకట్టుకోవడం-ఇలాంటి లీలలకు అంతే లేదు. దేవాదాయ శాఖలో దూరి, దేవాలయాల సొత్తును విధర్మీయుల నిమిత్తం బదలాయించే మహాపురుషుల సంగతి చెప్పనే అక్కరలేదు.

బాబా చరిత్రలోనే దీనిని గురించిన మరో విషయం ఉన్నది. శ్యామా బాబాకు చాలా దగ్గరి భక్తుడు. ఒకసారి బాబాకు రెండు రూపాయలు మనియార్డరు వచ్చింది. శ్యామా దానిని బాబాకు ఇవ్వకుండా





దాచిపెట్టాడు. బాబా వారికి ఇది తెలియనట్లే ఉన్నారు. కొద్దిరోజుల తర్వాత శ్యామా ఇంట్లో దొంగలు పడి అంతా దోచుపోయారు. శ్యామా చాలా బాధపడి వచ్చి బాబా దగ్గర మొరపెట్టుకున్నాడు. అప్పడు బాబా "నీ డబ్బు పోతే చెప్పకోడానికి నేనైనా ఉన్నాను. నావి రెండు రూపాయలు పోయాయి. నేనెవరికి చెప్పకోనురా!" అన్నారు. శ్యామాకు అర్థమయింది. తన దోషమే తనకు శిక్షయిందని స్వామి "నా కొంటెతనాన్ని ఇలా శిక్షించారా" అని నమస్కారం చేశాడు. బాబా శ్యామా తీసుకున్న రెండు రూపాయల కోసం అంతగా శిక్షించాలా అని ఒక ప్రశ్న వస్తుంది. అది కేవలం రెండు రూపాయలు మాత్రమే కావు. ఇచ్చిన వాడు రెండే ఇచ్చాడు. కానీ వాగ్దానం ఏమిటి? ఒక్కడుగు నావైపు వేస్తే పది అడుగులు నీవైపు వేస్తానని కదా! అంటే-ఆ రెండు రూపాయలు ఇచ్చిన వాడికి బాబా తిరిగి ఇరవై రూపాయలు ఇవ్వవలసి ఉంటుంది. అవి ఈయనకు అందలేదు. అవతలి వాడికి ఇరవై ఎలా దొరుకుతాయి? కనుక ఆ మేరకు శ్యామా అవతలి భక్తుడి ప్రయోజనాన్ని కూడా దెబ్బతీసినట్లే కదా! అదీ సంగతి. అందుచేతనే మన పెద్దలు దేవాలయ సంరక్షకులుగానీ, ధార్మిక సంస్థలు నడిపేవారు గానీ, గడ్డివాము దగ్గర కుక్కల్లాగా ఉండాలని చెప్పారు. కుక్క తాను గడ్డి తినదు. పరాయి గొడ్లను వచ్చి గడ్డి మీద పడనివ్వదు. అందుచేత మిత్రులారా, దైవద్రవ్యాన్ని పేదల కోసం, దీన దుఃఖితుల కోసం భక్తుల ప్రయోజనాల కోసం వాడాలే తప్ప-స్వప్రయోజనాల కోసం లగ్జరీస్ టైపులో ఉండే వస్తువుల కోసం వ్యర్థంగా ఖర్చు చేస్తే మాత్రం జాగ్రత్త సుమా! రామాయణంలో కుక్క తీర్పు చెప్పడానికి వచ్చేస్తుంది.

# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

**(గత సంచిక తరువాయి)**

ఆ.వె. కర్మను గలిగించు కామితములు పెక్కు
యిహ పర విషయాల యిష్టమొండు
పరువు పలుకుబడికి ప్రాకులాడుటయున్న
ఆత్మ బాటకడ్డు ననుచు నెఱుఁగు 14

ఆ.వె. ఇంద్రియముల రచన యీశ్వరు గలిగించె
బాహ్య విషయ చింత బఱగు నట్లు
ఆత్మ దర్శనమున కాసక్తి గలవాడు
తనదు లోన గనగ తన్మయంబు 15

ఆ.వె. పుడమినందు బుట్టి పుణ్యంబు మరచిన
పాప భీతి లేక బరుగు వాని
ఆత్మ బోధలేవి యంటగా రాలేవు
బుద్ధి బలము గలుగు బుధునికైన 16

ఆ.వె. దుష్టత విడనాడి దుర్మార్గములు వీడ
శాంతి బడయు నీకు శమము గలుగు
మనసు నిశ్చలతను మరిబొంద గలుగును
వికస మొందు మార్గ మిమల చరిత 17

ఆ.వె. సత్య భాషణంబు సన్మార్గ చరితంబు
బ్రహ్మచర్యమున్ను వ్రతము గల్గి
పరుల మేలు దలచు పరమ పావనునికి
ఆత్మ దర్శనంబు నగుట గద్దు 18





కం. నిత్యా-నిత్యం బరయగ
సత్యాన్వేషికిని-రాగ సక్తుని కైనన్
నిత్యంబెఱిగిన నాతం
డత్యంతాసక్తిఁ గోరు నాముష్మికమున్ 19

ఆ.వె. చిత్త శుద్ధి గలుగి చిన్న సాయము జేసి
ఆర్తు నాదుకొనుము నాదరమున,
చిత్త శుద్ధి లేక చిన్మయ రూపంబు
నాత్మ దర్శనంబు నలవి గాదు 20

సీ. కాయంబు బిడియొక శకటము - నాత్మ యగును
శకటంపు టెజమాని - సారథి యగు
బుద్ధి - మనసు కళ్లెమది - యింద్రియంబులు
పరువెట్టు గుఱ్ఱాలు - బరగ వాని
బాట యగుచునుండు - పట్టిన పగ్గాల
రీతిగా యజమాని బుద్ధి బట్టి
అల్ప బుద్ధుడయిన అవివేరఁ బోవుగా
చేరనెంచిన చోటు చెట్ట చేత

తే.గీ. మనసు పగ్గాలు బిగబట్టి - మాన్య వరుడు
యింద్రియాలను బంధించి - యీశు దలచ
సవ్య మార్గాన పయనించ - సాధ్య మగును
పరమ పదమును జేరగా - బాట విడక 21

ఆ.వె. మనసు నిర్మలంబు మమకార మదిలేదు
విషయ వాసనలును వీగిపోయె
అహము శూన్యమయ్యె యాశించడెద్దేని
అట్టి వాని కగును నాత్మ నెఱుఁగ 22

**(సశేషం)**

శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



- రచన : భండారు సదాశివరావుగారు

(గత సంచిక తరువాయి)

## 11. వనవాసం

పాండవులు నారచీరెలు కట్టుకొని తల్లికి నమస్కరించేందుకు వెళ్లారు. ఆమె కన్నీరుమున్నీరైంది. నోట మాట రాలేదు. ఒక్కరొక్కరినే గుండెకు చేర్చుకున్నది. మాద్రి తమ భర్త పాండురాజుతో సహగమనం చేసినప్పడు సహదేవుడు పసివాడు. అతణ్ణి తన పొత్తిళ్లలో పెట్టుకొని పెంచింది. ఆ చిన్నవాణ్ణి వదిలి తానెలా ఉండగలదు. విడవలేక విడవలేక 'నేనూ మీ వెంటనే వస్తా'నన్నది. ఈ విధంగా అవమానం పొంది నేనిక్కడ ఉండ లేనన్నది.

విదురుడు ఆమెను ఓదార్చాడు. "మహాదేవీ! నీవు ఆ కారడవుల్లో పన్నెం డేండ్లు ఉండగలగడం అసాధ్యమమ్మా! ఈ విదురుడు ఇంకా బ్రతికే ఉన్నాడు. నేను నీకు పుత్ర సమానుణ్ణి కాదా! నీవు నా దగ్గర ఉందువు గాని" అని నచ్చ చెప్పాడు.

కుంతి ద్రౌపదిని గుండెకు చేర్చుకున్నది. కన్నీరొలుకుతూ, "అమ్మా! ఆ సహదేవుణ్ణి చూడు. నోరు తెరచి ఇది కావాలని అనడు. నీవే కనిపెట్టి ఉండాలి. తల్లిలా చూచుకోవాలి" అని గద్గదంగా అన్నది.

చివరిసారిగా అందరూ కుంతికి నమస్కరించారు.

ముందు ముందు ధౌమ్యుడు, అతని వెనుక ద్రౌపదీ సమేతులైన పాండవులు మహావేగంగా నగరు దాటి వెళ్లారు. మొదటిసారి ద్యూతంలో జరిగిన దారుణాలు, అమానుషాలు హస్తినాపురంలో ప్రతి స్త్రీకి, ప్రతి పురుషునికీ తెలిసాయి. ద్రౌపదీదేవికి జరిగిన పరాభవానికి ప్రతి గుండె





మండిపోయింది. కౌరవులు పాపపు చేతలకు ప్రజల గుండెలు తల్లడిల్లాయి. వాళ్లందరూ వేలకు వేలుగా, కుటుంబాలతో పాండవుల వెంట అడవులలోకి "మేమూ మీ వెంబడే"నని బయలుదేరారు. దాదాపు ఆ మహానగరమే తరలి నడిచింది.

"మహారాజా! ప్రభువు దుర్మార్గుడైతే ప్రజలు జీవించి ఉండగలగడం కష్టం. మేము ఈ దుర్యోధనుని రాజ్యంలో ఉండలేము ప్రభూ! మేమూ మీ వెంబడే వస్తా"మని ఆర్తితో అభ్యర్థించారు. యుధిష్ఠిరుడు వారి సహృదయానికి, విశ్వాసానికి కరిగిపోయాడు. వారందరినీ ప్రేమతో సంభావించి, సమాధానపరచి, "మీ స్నేహాన్ని మరచిపోలేము. మీ ఋణాన్ని తీర్చుకోలేము. మీ సద్భావమే మాకు బలం. మా రాకకోసం ఎదురు చూడండి. మమ్మల్ని ఆశీర్వదించండి. పదమూడేండ్ల తరువాత తప్పక తిరిగివస్తా"మని నచ్చచెప్పి తిరిగి పొమ్మని అభ్యర్థించాడు.

గోధూళి వేళకు పాండవులు, ద్రౌపది గంగ ఒడ్డుకు చేరారు. అక్కడ ఒక మహా వటవృక్షం ఉన్నది. దానిని ప్రమణావతం అని పిలుస్తారు. దిక్కు లను పాదివి తన సందిట దాల్చే ఆ మహావృక్షం క్రింద విడిది దిగారు. సేద తీర్చుకున్నారు. అక్కడే ప్రక్కనే ప్రవహిస్తున్న గంగా సలిల ధారలో స్నాన మాడి శుచిర్భూతులైనారు. ఆ జలాన్ని త్రావి దప్పిక తీర్చుకున్నారు. కడుపు నింపుకున్నారు. పైనున్న ఉత్తరీయాలు నేలన పరచుకొని నిద్రలో ముని గారు. ద్రౌపది పైటకొంగు కప్పకొని కటిక నేలమీదనే శయనించింది.

కురు సభాంగణం నుంచి పాండవులు నిష్క్రమించిన తరువాత, ఒక్కొక్కరే భీష్మద్రోణాదులు కూడా వెళ్లిపోయినారు. వారు వెళ్లగానే మిగతా సభాసదులు, రాజన్యులు, కౌరవ సోదరులు, శకుని, కర్ణ, అశ్వత్థామాదులు కూడా వెళ్లిపోయినారు. సింహాసనం వెనుక చామర గ్రాహిణులు, ఒక రిద్దరు వందిమాగధులు, ద్వారపాలకులు మిగిలారు. సంజయుడు

ధృతరాష్ట్రుని చేయి పట్టుకొని నెమ్మదిగా ఆయన అభ్యంతర గృహంలోకి తీసుకొని వెళ్లాడు.

ధృతరాష్ట్రుని గుండెలో చీకటి ఆవరించింది. సరిగా ఊపిరి సలపడం లేదనిపిస్తున్నది. అతణ్ణి ఒక దిగులు క్రమ్ముకున్నది.

భీముడు దుర్యోధనుని తొడలు విరగగొడతానని ప్రతిజ్ఞ చేసి వెళ్లాడు. దుశ్శాసనుని గుండె చీల్చి నెత్తురు తాగుతానన్నాడు. అతడు ఎంతైనా తెగించగల సమర్థుడు.

కర్ణుణ్ణి వధిస్తానని అర్జునుడు ప్రతిజ్ఞ చేశాడు. కర్ణుడు పరాక్రమ వంతుడే కాని అర్జునుడికి ఉన్న దైవయోగం అతనికి లభించదు. పైగా విధివంచితుడు. ద్రౌపదీ స్వయంవరంలో తలదించుకొని ఇంటిముఖం పట్టినవాడు.

శకునిని నకులుడూ, అతని కుమారుడు ఉలూకుణ్ణి సహదేవుడూ సంహరిస్తామని ప్రతినబూనారు. ద్యూతక్రీడ పేరిట జరిగిన మహాపాపానికి వీరే కారకులు.

ధృతరాష్ట్రునికి నిద్ర కరువైంది. అన్నపానాలు రుచించవు. ఆప్తులు కూడా ఎడముఖం, పెడముఖమైనారు. ఒంటరితనాన్ని భరించడం కష్ట మైంది. బాధతో తన సోదరుడూ, మహామంత్రి అయిన విదురుణ్ణి పిలిపించుకున్నాడు.

"విదురా! పరిస్థితులు ఎలా ఉన్నాయి. నాకు ఏదో భయంగా ఉన్నది".


"భయమా? మీకింకా కావలసినదేమున్నది మహారాజా! ఇంకా సాధించవలసింది ఏమైనా ఉన్నదా?" అని నిష్ఠూరంగా విదురుడు అన్నాడు.

"నీవు నీతి విశారదుడివి. మంచీచెడూ తెలిసినవాడివి. కౌరవ, పాండవులిద్దరి మేలూ కోరేవాడివి. అందుకే నిన్ను పిలిపించాను.

**(సశేషం)**







# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

**(గత సంచిక తరువాయి)**

కానీ, భగవంతరావు అనుకోని విధంగా ఒకసారి బాబా దర్శనానికై షిరిడీ వచ్చాడు. అప్పుడు బాబా ప్రక్కనున్న భక్తులతో **"చూడండి, వీడి తండ్రి నాకు ఎంతో ప్రియమైనవాడు. కానీ, వీడు కనీసం నాకు నైవేద్యం కూడా పెట్ట కుండా నన్ను ఆకలితో మాడ్చుతున్నాడు"** అని అన్నారు. తద్వారా విఠలుని విగ్రహానికి చేసిన పూజ తమకే కైంకర్యమయిందని, ఆ విఠలుని విగ్రహంలో అంతర్భూతమై తామే యున్నామని చెప్పకనే చెప్పారు. ఆ విధంగా చరా చరాలలో తామే నిండియున్నామి అసంఖ్యాకమైన అనుభవాలను బాబా ప్రసాదించారు.

యత్కించతహీ జగత్యాం జగత్ ... అనే వాక్యానికి ఇంతకంటే అద్భుత మైన ఉదాహరణలు ఏముంటాయి?

**మాగృధం కస్య స్విద్ధనం ..... (ఇతరుల ధనం ఆశించవద్దు)**

నిజానికి ఈ వాక్యాన్ని సూక్ష్మంగా, నిశితంగా పరిశీలన చేస్తే "భగవంతుడు ప్రసాదించిన స్థితిలో సంతృప్తులమై ఉండాలి" అనే అర్థం బోధపడుతుంది. ఈ శ్లోకంలోని మొదటి రెండు వాక్యాల ప్రకారం ఈ జగత్తులోని చరాచరమంతా భగవంతుని సొంతం. అటువంటప్పుడు ఇక ఏదీ కూడా మనది, ఇతరులది అనే ప్రశ్న తలెత్తదు. అంతా భగవంతునిదై నప్పుడు ఇక మనది, ఇతరులది అనే విషయానికి తావెక్కడుంటుంది. కనుక, ఈ వాక్యంలోని నిగూఢమైన అర్థం "భగవంతుడు ఎలా ఉంచితే, అలా ఉండాలి" అని మనకు విస్పష్టంగా విశదమవుతుంది. కనుక ఆ దృష్ట్యా మన వివేచనను కొనసాగిద్దాం!

బాబా యొక్క భౌతిక జీవనకాలాన్ని నిశితంగా గమనించినట్లయితే ఆయన యొక్క ఆదర్శ జీవన విధానంలో ఈ అర్థమే మనకు స్పష్టంగా అవగతమవుతుంది. బాబా మొదటిసారి షిరిడీలో ప్రకటమైనప్పుడు ఎలా ఉన్నారో, దేహత్యాగం వరకు అలానే ఉన్నారు. ఆయన ఆహార్యంలో, ఆహారంలో వ్యవహారంలో అణుమాత్రం కూడా మార్పు లేదు. సృష్టిలో ఏ వస్తువు ఆయనపై ప్రభావం చూపలేకపోయింది. ఏ వైభవం ఆయనను స్పృశించలేకపోయింది. ఎల్లప్పుడూ ఎనలేని సంతుష్టతతో, అపరితమైన ఆనందంతో జీవన పర్యంతం నడయాడారు. తద్వారా భగవంతుడు మనకు ప్రసాదించిన స్థితిలోనే మన శ్రేయస్సు ఉంటుందని, అందువలన భగవంతుడు ఎలా ఉంచితే అలా ఉండాలని తమ ఆదర్శ జీవన విధానం ద్వారా చెప్పకనే చెప్పారు. బాబా ఎన్నోసార్లు భక్తులకు ఈ సత్యాన్ని తమదైన శైలిలో బోధించారు. **"అల్లామియా ఎలా ఉంచితే అలా ఉండాలి"** అని ఎన్నోసార్లు వ్యాఖ్యానించారు.

బాబా ప్రతిరోజు కొందరు భక్తులకు నియమంగా కొంత పైకం ఇచ్చే విషయం విదితమే! కానీ, ఎల్లప్పుడు తమ ప్రక్కనే ఉండే మహల్సాపతికి, షామాకు ఒక పైస ఇచ్చేవారు కారు. తాను కడు పేదరికాన్ని అనుభవిస్తున్నా సరే, తన పట్ల బాబాకు అవ్యాజమైన ప్రేమ ఉన్నా సరే, తన ప్రాపంచిక స్థితిలో మార్పు తెమ్మని మూర్తీభవించిన వివేక వైరాగ్యాలకు ప్రతీక అయిన మహల్సాపతి బాబాను ఎన్నడూ వేడుకొనలేదు. బాబా కూడా అలా చేయ లేదు. ఈ విషయంగా ఒకసారి బాబా వద్ద ఎంతో చనువున్న-షామా (మాధవరావు) బాబాతో "అరే దేవా! నీవంటి పక్షపాతి దేవుడను మేమింత వరకు చూడలేదురా! నీవు అందరికీ డబ్బులు పంచుతావు. కానీ, నీ దగ్గరే ఎల్లప్పుడూ పడియుండే మాకు మాత్రం పైసా రాల్చవు. ఇదెక్కడ న్యాయంరా దేవా!" అని అడిగితే, బాబా నవ్వుతూ "వాటితో మనకు పని లేదు షామ్యా! నీకు ఇవ్వవలసింది వేరే ఉంది" అని చెప్పేవారు.





**"నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను, నేను ఇవ్వదలుచుకున్నది వారు అడిగేంత వరకు"** అనే వచనాన్ని భక్తులకు ప్రసాదించి, ఎందరో భక్తులకు ఇహపర శ్రేయస్సును చేకూర్చిన బాబా, కొందరి విషయంలో వారి పారమార్థిక ప్రయోజనాల దృష్ట్యా, వారి ప్రాపంచిక స్థితిగతులలో మార్పునకు ససేమిరా అన్నారు. ఉదాహరణకు మన ఈ చరిత్ర నాయకుడు దాసగణు ఫౌజ్‌దారుగా పదోన్నతి పొందాలని పరితపించాడు. కానీ, బాబా మాత్రం నిర్ద్వంద్వంగా ఖండించారు. తాను ప్రాపంచిక జీవనాన్ని వదలి, పారమార్థిక జీవనానికి పూర్తి సమయం కేటాయించే వరకు తనను వదల్లేదు.

"భగవంతుడు మనకు ఏది చేసినా మంచే చేస్తాడు" అని అనుకునే వారి జీవితంలో అసంతృప్తికి తావెక్కడుంటుంది? మన పారమార్థిక పురోగమనమే సద్గురువు యొక్క ఏకైక లక్ష్యం అని ముందర ప్రస్తావించుకున్నాం. ఆ పురోగమనానికి ఏ స్థితి అయితే అనుభవించవలసి ఉంటుందో, ఆ సమర్థ సద్గురుడు అటువంటి స్థితినే మనకు ప్రసాదిస్తాడు. కాబట్టి ఆ స్థితిలో కూడా మనం ఆనందంగా ఉండాలనే యోగ భక్తి, ఉన్నత పరిణతి, ఉచ్ఛశ్రేణి వివేక వైరాగ్యాలు కలిగియుండే వారి జీవితంలో దుఃఖానికి చోటు ఎక్కడ ఉంటుంది? సుఖానికి చేటు ఎలా కలుగుతుంది? "ఠేవిలే అనంతే తైసాచ్ రహావే (ఆ భగవంతుడు ఎలా ఉంచితే అలా ఉండాలి)" అనే తుకారాం అభంగం ఈ సత్యాన్నే బోధిస్తున్నది.

భగవంతుడు ప్రసాదించిన స్థితితో సంతృప్తి చెందక, ఐహిక ఐశ్వర్యాల కోసం, సుఖాల కోసం ప్రాకులాడే వారి పారమార్థిక పురోగమనం మందగిస్తుంది. అలా చేస్తే మానవ జీవన పరమార్థం మసివాడుతుంది అని మహాత్ముల ఉవాచ! అదే, వివేక వైరాగ్యాలనే సంపదను కూడగట్టుకొని, "అన్నీ సొంతమైన ఆ భగవంతుని సొంతం చేసుకుంటే, ఇక మనకు సొంతం కానిది ఏముంటుంది" అనే భావనతో, ఆ దిశగా భగవదనుగ్రహం కోసం పరితపించే వారికి కడు పేదరికం కూడా నిండైన భాగ్యంలాగా గోచరిస్తుంది. **(సశేషం)**

# పరమాత్మ దివ్యనామం యొక్క మహిమ

ఆధ్యాత్మిక జీవనపు తొలిరోజులలో 'యథార్థమైన ధ్యానం' గురించి దిగులుపడవలసిన పనిలేదు. జపం చక్కగా చేస్తూ, ఇష్టదైవం మీద మనస్సు లగ్నం చేసి ఉంచండి. కాలం గడుస్తున్న కొద్దీ జపం ధ్యానంగా రూపాంతరం చెందుతుంది. అంటే కొంతకాలానికి ఒక గిన్నెలో ఉన్న నూనెను మరొక గిన్నెలో పోస్తున్నప్పుడు, ఆ నూనె ధార తెంపు లేకుండా ఎలా క్రిందికి పడుతుందో, అదే విధంగా మీ ఆలోచనలు ఒక అవిఛ్ఛిన్న తైలధారలా, భగవంతుణ్ణి కేంద్రంగా చేసుకుని ముందుకు సాగుతాయి.

క్రమేణా, జపసాధన వలన ఈ ప్రపంచం కంటే పరమాత్మే ఎక్కువ యథార్థమైనవాడుగా కనిపిస్తాడు! అప్పడే నిజమైన ధ్యానం సాధ్యపడుతుంది. మొదట చేయవలసిన పనులను సక్రమంగా చేస్తే, తరువాత ఫలితాలు వాటంతటవే వస్తాయి.

జపసాధనను మీకు చేతనైన విధంగా మొదలుపెట్టండి. పైకి వినపడేటట్లు లయబద్ధంగా ఓంకారాన్ని జపించండి. క్రమక్రమంగా, జపాన్ని మరింత మౌనం చేసి, ఓంకారం వెనుక ఉన్న శబ్దబ్రహ్మతో అనుసంధానానికి యత్నించండి. సామరస్యంతో కూడిన ఈ శబ్దాన్ని జపిస్తూ, ఈ శబ్దం అనంతమైన పరమాత్మను సూచించే ఒక చిహ్నం అని గుర్తెరగండి. ఆ పరమాత్మలో ఉన్న ఎల్లలు లేని ఆనందాన్ని, ప్రేమను తలుచుకోండి. ఒక రేడియోను సక్రమంగా 'ట్యూన్' చేయడం వలన సంగీతాన్ని లేదా వివిధ రకాల కార్యక్రమాలను వినగలుగుతాము. అలాగే విశ్వంలో అనాది నుంచీ ఉన్న విశ్వకంపనాలతో మనల్ని అనుసంధానం చేసుకోవడం వలన విశ్వమనస్సుతో (హిరణ్యగర్భ) మనకు సంసర్గం ఏర్పడుతుంది. ఈ సంపర్గం ద్వారా సర్వాంతర్యామి, మనలోని ఆత్మలకు ఆత్మ, సర్వేశుడు అయిన పరమాత్మతో సంస్పర్శ ఏర్పడుతుంది.





సర్వవిధాలుగా ప్రయత్నిస్తూ జపసాధనను కొనసాగించండి. సాధకుడు తన గురువు నుంచి పొందిన మంత్రానికి ఎంతో శక్తి ఉంటుంది. ఆధ్యాత్మిక పథంలో ఎదురయ్యే అన్ని అడ్డంకులనూ తొలగించి, అతనిలోని పారమార్థిక చైతన్యాన్ని జాగృతం చేస్తుంది. మనం కాళీ, దేవి లేదా వివిధ నామాలతో వ్యవహరించే దివ్యజనని యొక్క శక్తి ఆ మంత్రంలో ఉంటుంది. ఆ దివ్యజనని ఈ ఆధునిక యుగంలో శ్రీరామ కృష్ణులుగా అవతరించింది.

ఒక్కొక్కసారి సాధకుడు తన జపమాలతో లేదా చేతితో తనలోని ఉన్నతమైన చైతన్యకేంద్రాలను స్పృశించడం వలన ఎంతో మేలు జరుగుతుంది. భౌతికమైన స్పర్శ ద్వారా ఆయా విశేషకేంద్రాల మీద ఏకాగ్రం చేయడం సులభం అవుతుంది. పవిత్రమైన శబ్దం లేదా మంత్రం మన మనస్సుకు ఒక విధమైన ఊతాన్ని ఇస్తుంది. ఏవైనా విపత్కరమైన పరిస్థితులు ఎదురైనప్పడు, శాంతంగా ఉంటూ, మనల్ని మనం పరిశీలించుకుంటూ ముందుకు సాగాలి. మన హృదయాంతరాళాల నుంచి ఆ దివ్యజననిని ప్రార్థించాలి. ఏ విపత్తు అయినా మన సమతుల్యతను ఎందుకు పాడుచేయాలి? గొలుసును వదిలేశావంటే నిన్ను నువ్వు కోల్పోయినట్టే. భౌతిక సహాయాలు అందని పరిస్థితులలో దైవ సహాయం మాత్రమే శరణ్యం. అంటే మనందరి ఆత్మలకు ఆత్మ అయిన పరమాత్మే మనకు సహాయపడతాడు. జపం వలన మాత్రమే ఈ దైవ సహాయానికి మనం చేరువ కాగలము.

మనం సాధారణంగా ఆధ్యాత్మిక సాధన రూపంలో చేసేది జపం మాత్రమే. దీనికే మనం 'ధ్యానం' అని నామకరణం చేస్తాము! నైతిక జీవనం, కర్తవ్యనిష్ఠ, జపం, ప్రార్థన, సద్గ్రంథ పఠనం, ఆ పఠించిన భావాలపై చింతన వంటి సాధనలను పునాదిగా చేసుకోకుండా, ధ్యానం చేయడం అసంభవం అని మనం గుర్తెరగాలి. ఈ సాధనలే మన మనస్సును

ఇంద్రియార్థాల ఆకర్షణల నుంచి, లెక్కకు మిక్కిలి ప్రలోభాల నుంచి మరల్చి, పవిత్రమైన ఆలోచనల వైపు మళ్లిస్తాయి. ఇన్ని రకాల సాధనలు చేస్తున్నా, పారమార్థిక జీవనపు ప్రారంభదశలో ఈ పవిత్రమైన ఆలోచనల పరంపర అవిచ్ఛిన్నంగా ఉండకపోవచ్చు. వదలకుండా చేసే ప్రయత్నం వలన మన ఆలోచనా పరంపర పవిత్రంగా మారుతుంది.

మనోవాక్కాయ కర్మలలో మనం మరింత పవిత్రులం అవుతున్న కొద్దీ, మన ఏకాగ్రత పెరుగుతుంది. ధ్యానం మెరుగవుతుంది. సాకార, నిరాకార రూపాలలో భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోగలుగుతాము. నిత్య-అనిత్యాల మధ్య జీవాత్మ, పరమాత్మల మధ్య ఉన్న సంబంధం మనకు అవగతం అవుతుంది. మనం ధ్యానం సర్వోత్కృష్ట స్థితిని చేరుకుంటుంది. మనలోని జీవాత్మ తన గమ్యమైన పరమాత్మను సాక్షాత్కరించుకుని ముక్తి, ప్రశాంతి, స్వేచ్ఛలను పొందుతుంది.

ఆ పరమాత్మ దివ్యనామం మనందరికీ శాంతిసౌఖ్యాలను ఒసగుగాక!

# బాబా అంటే అర్థం అద్భుతశక్తి

**- యిమ్మిడిశెట్టి ప్రభాకరరావు, హైదరాబాద్**

ఔరంగాబాద్‌లో నివసించే అనూరాధా అధికారి చిన్నతనం నుంచి సాయిబాబా భక్తురాలు. ఆమె బాబాను ఒక్కరినే పూజించేది. అనూరాధ అంటుంది "యుక్తవయసు రాగానే అదృష్టంకొద్దీ నాకు సాయిభక్తుడితో వివాహమయింది. మా అత్తవారి కుటుంబమంతా మంచి సాయిభక్తులని నాకు అప్పుడు తెలీదు. అత్తవారింట్లో మొదట అడుగిడునప్పుడు హాలులో గోడకున్న అందమైన బాబా చిత్రపటం నాకు ఆహ్వానం పలికింది. అది సాయి ద్వారకామాయిలో కూర్చొని వున్న భంగిమ ఆ సమయంలో నా ఆనందానికి అవధులు లేవు. నా కళ్ళు ఆనందభాష్పాలతో చెమర్చుతుండగా,





మా అత్తగారు ఆ పటానికి సాష్టాంగ నమస్కారం చెయ్యమని ఎంతో అనునయంగా చెప్పింది. నా రక్షణ బాధ్యత, బాగోగులు బాబాయే చూసుకుంటారు, ఇంక నేను నిశ్చింతగా వుండొచ్చు అన్న భరోసా నాకానాడే కలిగింది".

ఒక సంవత్సరం తరువాత ఆమె భర్తకు కొల్హాపూర్ బదిలీ అవడం వల్ల అనూరాధ దంపతులు తమ నివాసం అక్కడికి మార్చారు. తరువాత మరొక సంవత్సరానికి వారికి పాప పుట్టడం, ఒక నెల వయసులో చెవికి సంబంధించిన వ్యాధి వలన రెండు చెవుల నుండి దుర్వాసనతో కూడిన తెల్లటి ద్రవం కారసాగింది. అప్పుడప్పుడు కొంచెం రక్తంతో కూడినట్లుగా ఎర్రగా కూడా వుండేది. ఇ.యన్.టి. స్పెషలిస్టుకు చూపించగా, చెవిలో వెయ్యడానికి చుక్కల మందు ఇచ్చారు. అనూరాధ మందు ఎంతో శ్రద్ధగా వాడుతూ ఎంతో సున్నితంగా పాప చెవులు శుభ్రం చేసేది. కానీ, వ్యాధి ఏమాత్రం తగ్గకుండా చెవుల నుంచి చీము కారుతూనే ఉంది.

ఒకరోజున అనూరాధ మామగారు వాళ్ళింటికొచ్చారు. తన స్నేహితుడు డాక్టర్ దేశ్‌పాండేకి పాపని చూపించమని సలహా ఇచ్చారు. డాక్టర్ దేశ్‌పాండే బెర్లిన్ దేశంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి ఎంతో ప్రఖ్యాతిగాంచిన ఇ.యన్.టి. సర్జన్. పాపని పరీక్షించి రెండు చెవుల కర్ణభేరిలో రంధ్రం వుందని, అందువల్ల పాపకి వినికిడి శక్తి బాగా లోపించడం గానీ, ఆఖరుకు చెవిటితనంగాని వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అనూరాధకి డాక్టరు గారి మాటలు అశనిపాతంగా తగిలాయి. ఎంతో నిస్పృహ చెందింది. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత డాక్టరుగారిచ్చిన ఇయర్‌డ్రాప్స్ సాయిబాబా పటం ముందు ఉంచి, "బాబా, నా పాపకి చెవిటితనం వస్తే ఆమె జీవితమంతా సర్వనాశనమయినట్లే కదా. పసిమొగ్గగా వుండగానే త్రుంచెయ్యకుండా, నా బిడ్డ జీవితం పువ్వులా వికసించేలా అనుగ్రహించు. నాకు ఊహ తెలిసినప్పటి నుండి నిన్నే పూజిస్తున్నాను. ఈ క్షణం నుంచీ

ఈ ఇయర్‌డ్రాప్స్ వెయ్యకుండా నా బిడ్డ చెవిలో ఊదీ తీర్థమే వేస్తాను. నీ అనుగ్రహంతోనూ, ఊదీ తీర్థ మహిమతోనూ బిడ్డ జబ్బు తగ్గిపోతే నీ పేరుతో మొదలయ్యేటట్లుగా పేరు పెట్టుకుంటాం. యావజ్జీవితం నీకు కృతజ్ఞతగా ఉంటాం" అంటూ అనూరాధ ఎంతో ఆర్తితో హృదయపూర్వకంగా ప్రార్థించింది. భారమంతా బాబాపై వేసి తేలికపడ్డ హృదయంతో చిన్న సీసాలో నీరు పోసి, అందులో కొంచెం ఊదీ వేసి బాగా కుదిపి, పాప చెవులలో రెండు, మూడు చుక్కల చొప్పన రోజూ మూడుసార్లు వేసింది. మూడు రోజులపాటు ఉపవాసం ఉంది. పాప జబ్బు నయం చెయ్యమని సాయిని ప్రార్థిస్తూనే గడిపింది.

ఆ మరునాడు అనూరాధ వాళ్ళ అపార్టుమెంటు బాల్కనీలో నిలబడి క్రిందనున్న వీధి వంక చూస్తూ ఉంది. ఒక ఫకీరు వీధిలో నిలబడి రమ్మని సైగ చేస్తూ "అమ్మా, క్రిందికి దిగిరా" అన్నాడు. అనూరాధ కొంచెం బియ్యం తీసుకుని క్రిందికి వెళ్ళింది. అవి తన జోలెలో వేయించుకొంటూ, "తల్లీ, నువ్వు ఏదో బాధలో వుండి దిగులుపడుతున్నావు కదా! ఏమీ కలత చెందకు, సాయిబాబా నీతోనే వున్నాడు. నీకు అంతా మంచే జరుగుతుంది" అన్నాడు. కొల్హాపూర్‌లో హిందీలో మాట్లాడే ఫకీర్లు వుండడం అరుదు. మళ్ళీ ఆ ఫకీరే, "అమ్మా, నేనిప్పడే రామేశ్వరం నుంచి తిరుగు ప్రయాణమై షిరిడీ వెళ్ళే దారిలో వున్నాను. మరి నాకు ఏమైనా కొంచెం దక్షిణ ఇస్తావా?" అన్నాడు. ఆ ఫకీరు ముఖవర్చస్సు, కరుణరసం జాలువారుతున్న అతడి కళ్ళు చూసి అనూరాధకి అతడి పట్ల ఎంతో గౌరవభావం ఏర్పడింది. వెంటనే ఒక రూపాయి నాణెం , 25 అరికాకాసులు తెచ్చి అతడికిచ్చింది.

పాపకి చెవిలో వెయ్యవలసిన చుక్కల మందు మానివేయడమనేది పూర్తిగా అనూరాధ తనకు తానుగా చేసుకన్న నిర్ణయమే! ఈ విషయం ఇంట్లో మరెవరికీ తెలీదు. ప్రతిరోజూ రెండు, మూడు చుక్కల ఊదీ తీర్థం (ఊదీ+నీరు) రోజుకి మూడు సార్లు నియమంగా పాప రెండు





చెవులలోను వేసేది. నెమ్మది నెమ్మదిగా కొద్ది రోజులలోనే చెవుల నుంచి చీము కారడం ఆగిపోయింది. చెవులు మామూలుగా అయిపోయాయి. పాపని పరీక్ష కోసం డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళింది. ఏమాత్రం దోషం లేకుండా పాప తాలూకు కర్ణభేరి రంధ్రాలు పూడిపోయాయి. వ్యాధి లక్షణాలు మచ్చుకు కూడా లేవు. అప్పడు అసలు విషయం ఇంట్లో వాళ్ళకి చెప్పింది. "సాయి బాబా అపర ధన్వంతరి. సాయిబాబా వెలిగించిన పవిత్రధుని నుండి వచ్చిన ఊదీ సకల రోగాలకు ఏక మూలికా ప్రయోగంలాంటిది. దానికి మా అనుభవమే నిదర్శనం. లేకపోతే మనకు సాయిబాబా యందు వారి తీర్థ మందు మొక్కవోని విశ్వాసం ఉండాలి" అంటుంది అనూరాధా అధికారి.

జై సాయిరాం!

సౌజన్యం : ప్రసాద్, వాల్యూం 33, నెం.9, ఆగస్టు 1979

## ఊపిరి ఉన్నంతవరకే!

మా చిన్నప్పడు ఇంటి ఎదురుగా ఓ టెలిఫోన్ లైన్‌మ్యాన్ ఉండేవాడు. ఉద్యోగరీత్యా అతనికి సాధారణ జీతమే ఉండేది. కానీ అతడు తొక్కని అడ్డదారులు లేవు; ఎంత నమ్మినవారినైనా సరే మోసం చేసేవాడు. ఇంటి పక్కన ఎవరైనా ఇల్లు కడుతుంటే పాపం! రాత్రికి రాత్రి తన ముగ్గురు కొడుకుల్ని పంపి ఇటుకలు, రాళ్ళు తెచ్చి తన ఇంట్లో పెట్టుకునేవాడు. ఇంటి ప్రక్క నుంచే రైల్వే ట్రాక్ ఉంది. బొగ్గును నింపుకొని వెళ్ళే రైలుబండి పొరపాటున ఎప్పడైనా ఆగిపోతే, కొడుకులను అందులోకి ఎక్కించి బొగ్గు దొంగిలించి, బయట అమ్ముకునేవాడు. ఎలాగైతేనేం, రెండంతస్తుల మేడ కట్టాడు. తన చతురతకు తనే మురిసిపోయి, అహంకరించేవాడు. ఆయన ఆ వీధిలో ఓ పులి! ఇలా ఆయనకు యాభయ్యేళ్ళు వచ్చేసరికి, అనుకోకుండా

మధుమేహం సోకింది; ప్రమాదవశాత్తూ కాలికి దెబ్బ తగిలింది; మాయని పుండుగా పరిణమించింది.

ఇక, అప్పటినుంచి ఆయన ఆటలు ఆగిపోయి; దేవుడి ఆట ప్రారంభ మైంది. రోజురోజుకూ ఆయన కష్టాలు పెరిగిపోసాగాయి. మృగంలా అందరినీ బెదిరించిన ఆ వ్యక్తి రోగంతో వడలి, విలవిలలాడిపోయాడు. సింహం ముందు జింకల్లా బెదిరిన పిల్లలు ఆయననూ, ఆయన కాలి పుండునూ భరించలేక బయటపడుకోబెట్టేవారు! తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆయన త్వరగా చనిపోతే తనకు ఉద్యోగం వస్తుందని పెద్ద కొడుకు ఎదురుచూపు ఓ వైపు! ఇంటినీ, డబ్బులనూ తండ్రి ఎలా పంచుతాడా అని మిగతా కొడుకుల ఆత్రం మరోవైపు! చివరి రోజుల్లో ఆయన మానసికంగా, శారీరకంగా నరకం అనుభవించాడు. కుమిలిపోతూనే ఓ రోజు కన్నుమూశాడు.

ఆసుపత్రి నుంచి దేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. రెండు గంటలు గడవగానే, అన్ని రోజులూ ఆయనతో జీవితాన్ని పంచుకున్న అర్ధాంగి సైతం బంధువులతో 'త్వరగా తీసేయండి; నాకు ఆయనను చూడాలంటే భయమేస్తోంది' అనడం మొదలుపెట్టింది. దూరప్రాంతం నుంచి ఇంకా రావలసిన బంధువులు కడసారి చూపు చూసుకోకముందే ఆ శరీరాన్ని కాటికి తరలించారు. అడ్డమైన గడ్డి తిని కట్టుకున్న ఇంట్లో ఆయనను కొన్ని గంటలు కూడా ఉంచలేకపోయారు.

సమాజంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలు. ఊపిరి ఉన్నంతవరకే మన శరీరానికి ఉనికి అన్న సత్యం తెలుసుకోలేని మన అవివేకాన్ని ఆనాడే ఎత్తిచూపారు ఆదిగురువులైన శంకరాచార్యులు. అందుకే తన 'భజ గోవిందం'లో ఇలా అంటారు.

**యావత్పవనో నివసతి దేహే తావత్ పృచ్ఛతి కుశలం గేహే।**

**గతవతి వాయౌ దేహాపాయే భార్యాబిభ్యతి తస్మిన్ కాయే॥**

శరీరంలో ఊపిరి ఉన్నంతవరకే ఇంటిలోని వారు 'కుశలమా?' అని





అడుగుతారు. ఆ ఊపిరి ఆగిపోయి, మరణం సంభవించినప్పుడు ఆ కళేబరాన్ని సమీపించేందుకే భార్య కూడా భయపడుతుందన్న కఠోరసత్యాన్ని కళ్ల ముందుంచారు. మన మోహపు తెరలను చీల్చేందుకు వారు విసిరిన అక్షర తూణీరాలివి! అలాగని భార్యపై భర్త, భర్తపై భార్య విరక్తిని పెంచుకోవాలని పరమాచార్యులు ప్రవచించడం లేదు. ఎవరికెవరు ఎంత వరకో స్పష్టం చేస్తున్నారంతే! కఠినమైనప్పటికీ సత్యం సత్యమే! నిత్యజీవితంలో మనల్ని కమ్మేస్తున్న మాయమబ్బులు ఎంత గాఢంగా ఉన్నాయంటే, వేయి సూర్యుల ప్రకాశం కూడా వాటిని ఛేదించలేదు. అందుకే శంకరాచార్యులు, తన జ్ఞానబోధతో మనల్ని మేల్కొలుపుతూ హెచ్చరిస్తున్నారు. ఈ శరీరానికి సంబంధించి అల్లుకున్న అనుబంధాలకూ, ఆశాపాశాలకూ మనమెంత బద్ధులమైపోతున్నామంటే; వాటికి అతీతంగా ఒక్క క్షణమైనా ఆలోచించే సాహసం చేయడం లేదు.

సగభాగమే సర్వస్వమా? నిజానికి గృహస్థాశ్రమం కూడా మోక్షానికి మార్గమే! కానీ కేవలం లౌకికమైన బంధాల్లోనే బందీలు కావడం వల్ల చాలామంది ఆ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించడం లేదు. దాంపత్య జీవితాన్ని ఆధ్యాత్మిక కోణంలో ఆవిష్కరింపజేసుకోవడం వల్ల చివరకు ఏ స్థితికి చేరుకుంటామో హితవు పలికారు శంకరాచార్యులు. జీవిత భాగస్వామిని కేవలం శరీరానికి అర్ధభాగంగానే తలచి, భార్యను భర్త, భర్తను భార్య భోగ వస్తువులుగా భావిస్తే చివరకు ఆత్మీయతలు, అనుబంధాలు కూడా అశాశ్వతంగానే ముగిసిపోతాయి. అదే భావాన్ని భగవాన్ శ్రీరామకృష్ణులు ఓ బెంగాలీ గీతంలో -

**జార్ జొన్నో భేభే సేకీ తొమార్ పొంగే జాబే?**

**షేయ్ ప్రేయసీ దీబే ఛోడ్ అమంగళ్ హొబే బోలే**

"ఎవరి కోసమైతే నీవు జీవితమంతా యమ యాతనలు పడుతున్నావో, వారు నీతో వస్తారా? నీవు ప్రియంగా భావించే భాగస్వామే నీవు పోయాక వెంట రాకపోగా, 'ఇది పాచి పీనుగ'ని ఈసడిస్తుంద'ని విశదపరుస్తున్నారు.

ఆలుమగలు ఆత్మ బంధువులుగా మసలుకోవాలన్న విషయాన్ని మరచి కేవలం భౌతిక సంబంధాలనే కొనసాగిస్తే జీవితాలు రసహీనమవుతాయి. భారతీయ సనాతన ధర్మం వివాహ వ్యవస్థకు కూడా ఒక సమున్నతమైన ఆదర్శాన్ని కల్పించింది. దానిని విస్మరించడం వల్లే మానవ జీవితంలోని దాంపత్యధర్మానికి విఘాతం కలుగుతోంది.

లోకం ఓ చలివేంద్రం : ఆధ్యాత్మిక సంపద మనలో నైరాశ్యాన్నీ, నిర్లిప్తతనూ పెంచుతుందని చాలామంది అపోహపడుతుంటారు. కానీ, అంతర్లీనంగా ఆధ్యాత్మికత మన జీవితాన్ని మరింత అర్థవంతంగా తీర్చి దిద్దుతుంది. ఎల్లకాలమూ ఈ లోకంలో మనం ఉండమని తెలుసుకుంటే, ఇప్పటికన్నా గొప్పగా సార్థకంగా జీవించగలుగుతాం. ఎవరిపైనా అతి ప్రేమనూ పెంచుకోం! అలాగని ఎవరినీ ప్రత్యర్థులుగానూ భావించుకోం! దారిలో సహ ప్రయాణికులుగా మనవారంతా పరిచయమయ్యారని గుర్తిస్తే, ఒకరి ఆగమనం మనల్ని ఆనందాల్లో తేల్చేయదు; మరొకరి వియోగం మనల్ని విషాదంలో ముంచెత్తదు. భార్యకు భర్త కావచ్చు. భర్తకు భార్య కావచ్చు-కొన్నినాళ్ళు ఈ జీవితమనే నాటకరంగంలో తమ తమ పాత్రల్ని పోషించడానికి వచ్చారంతే! అందుకే శ్రీమద్భాగవతం ఇలా అంటుంది.

నీతాగారని నిష్ఠ పాంథుల క్రియన్ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు గూడీ విత్తురు, సదా సంగంబు లేదొక్కచో ...

అవును మరి! లోకం ఒక చలివేంద్రం లాంటిది. మనుషులందరూ దాహం తీర్చుకోవడానికి వచ్చిన బాటసారులు. వాళ్ళు దాహం తీర్చుకోవడానికి వచ్చి వెళ్ళిపోతున్నట్లు, మనం కూడా ఈ సంసారంలోకి వచ్చి మన పని కాగానే వెళ్ళిపోతుంటాం. ఎప్పుడూ ఒకచోటే కలిసి ఉండం, కలుస్తూ ఉంటాం, విడిపోతూ ఉంటాం.

అతితో అనర్థం : భాగస్వాములుగా ఒకరిపై మరొకరికి ప్రేమాను రాగాలు ఉండకూడదని శంకరాచార్యుల ఉద్దేశం కాదు. కానీ తన తోటిదే





లోకంగా జీవిస్తూ, ఒకరి నుంచి మరొకరు అతిగా ఆశించవద్దని వారు గుర్తు చేస్తున్నారు. నిత్యజీవితంలో చాలామంది దంపతుల మధ్య ఘర్షణలు పొడసూపడానికి కూడా ఈ తిగా ఆశించే గుణమే కారణం. అతిగా ఆధారపడే తత్త్వమే కొన్నాళ్ళకు నిరాశకూ, నిర్వేదానికీ గురిచేస్తుంది. అందుకే మనస్సును ఉన్నతమైన ఆలోచనల వైపుకు, ఉదాత్తమైన ఆదర్శాల వైపుకు మళ్ళిస్తే, సంకుచితమైన బంధాల్లో మనస్సు ఇరుక్కుపోదు. అప్పుడు అది అశాశ్వతమైన శారీరక సుఖాలకే పరిమితం కాదు. నిజానికి ఈ ప్రాపంచిక బంధాలకు కారణం తాత్కాలిక వ్యామోహమే! అందుకే భక్త కబీర్ ఈ ప్రాపంచిక బంధాల అశాశ్వతత్వాన్ని ఇలా గుర్తు చేస్తున్నారు :

ఏక్‌దిన్ ఐసా హోయగా కోఊ కాహూ కా నహీ
ఘరకే నరీకో కహే తనకీ నారీ నాహీ

నిజమే! నీవు ఎవరికీ సంబంధించని రోజొకటి వస్తుంది. అప్పుడు నీ ఇంట్లోని నారి (స్త్రీ) నిన్ను వదిలేస్తుంది; నీ శరీరంలోని నరమూ నిన్ను త్యజిస్తుంది!

## బలవంతుడి భంగపాటు

(32వ పేజీ తరువాయి)

పరీక్ష, గెలవగలవు. నీవు బలవంతుడవే-సందేహం లేదు. అయితే ఒక్క విషయం గుర్తుంచుకో సోదరా! మనం ఎవరితోనైనా పోరాటానికి సిద్ధ మయ్యేముందు-మన శక్తినీ, ఎదుటివాడి శక్తినీ సరిగా అంచనా కట్టుకొని మరీ పోరుకు దిగాలి. అలా కాకపోతే కొన్నిసార్లు ఓటమిని పొందవలసి వస్తుంది" అన్నాడు.

భీముడు హనుమకు తాము వనవాసానికి రావలసి వచ్చిన కారణాలు, కౌరవుల దురంతాలు చెప్పాడు! అన్నీ విని ఆంజనేయుడు చిరునవ్వుతో "ఫరవాలేదు-ధర్మమే జయిస్తుంది. నీవు నిశ్చింతగా ఉండు సోదరా!" అని ఓదార్చాడు. ఆపైన భీముడు హనుమంతునికి నమస్కరించి, సౌగంధిక పుష్పాల కోసం వెళ్ళిపోయాడు.

# మాతృసంస్థ కబుర్లు

జనవరి 26, 2024న 75వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా శ్రీ సాయి విద్యాధామం పాఠశాలలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత దేశంలో గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజుగా జరుపుకుంటున్నాము.

సాయి విద్యాధామం పాఠశాల రంగురంగుల రంగవల్లికలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించబడింది. ఉదయం 8.30 ని.లకు విద్యార్థినీ, విద్యార్థులు జై భారతమాత, జైజై భారత మాతా అంటూ నినాదాలు చేస్తూ భారతమాత మందిరాన్ని దర్శించి ఆ తల్లికి నీరాజనాలు సమర్పించారు. అమ్మా దేశానికి మళ్ళీ రామయ్యను పంపించి రామరాజ్యం వచ్చేలా చేశావు. నీ పిల్లలుగా మేము చాలా అదృష్టవంతులం తల్లి అని పుష్పమాలాంకరణ చేశారు. 9.00 గం.లకు పతాకావిష్కరణ కార్యక్రమం సాయిదత్త పీఠాధిపతులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీ రామానంద ప్రభుజీగారి కరకమలములచే జరిగింది. పతాక వందనం అనంతరం విద్యార్థులందరూ దేశ భక్తి గేయాలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విచ్చేసిన దేశభక్తులందరినీ ఆనందభరితులను చేసారు.

పాఠశాల కరస్పాండెంట్‌గారు అయిన డా॥ జి.చంద్రారెడ్డిగారు గణతంత్ర దినోత్సవాన్ని గురించి విద్యార్థులకు వివరంగా వివరించినారు. శ్రీశ్రీశ్రీ రామానంద ప్రభుజీవారు శ్రీ బాలరాముని అయోధ్య, ప్రాణప్రతిష్ఠ జరుపుకోవడానికి 500 సంవత్సరాల పోరాట ఫలితమనీ, ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నామని, ఎందరో ప్రాణత్యాగాల ఫలితమని వివరించారు. 26వ తేది మధ్యాహ్నం 3 గం.లకు పూజ్య గురుదేవులు అయిన శ్రీశ్రీశ్రీ స్వామీ





శ్రీరామానంద ప్రభుజీ వారు అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్టు వారి ఆహ్వానం మేరకు శ్రీ బాలరాముని ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకుని, కాశీలో విశ్వనాథుని సందర్శించుకుని, మాతా గంగాదేవిని మనసారా ప్రార్థించి, ఆశ్రమానికి వస్తున్న సందర్భంగా పరిసర గ్రామ ప్రజలు, ఆశ్రమవాసులు స్వాగతం పలుకుతూ మంగళ హారతులతో, రామనామ సంకీర్తనలతో వాయిద్యాలతో ఆహ్వానించడం జరిగింది. దేవాలయంలో శ్రీరామచంద్రునికి పూజా కార్యక్రమం అనంతరం అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షతలు, సరయూ నది ఇసుక, యజ్ఞ విభూతి, శ్రీరాముని చిత్రపటం, కంకణం, లడ్డూ ప్రసాదం మొదలైనవి భక్తులందరికీ రామానంద ప్రభుజీ వారి కరకమలములచే అందించారు.

ఫిబ్రవరి 3వ తేదీ శ్రీ సాయి విద్యాధామం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. పాఠశాలకు, వారికి ఉన్న అనుబంధాన్ని సభాముఖంగా చాటుకున్నారు. సాయి విద్యాధామం ప్రత్యేకతను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్‌గారు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు భవిష్యత్తులో ఎలా ఎదగాలో వివరించారు. సమాజ స్థితిగతుల గురించి వివరించారు. చివరగా శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు విద్యార్థులకు చదువు-సంస్కారం, మంచి-చెడు ఆలోచనా విధానాల గురించి వివరించారు.

ఫిబ్రవరి 10వ తేదీ సాయిధామం సేవాశ్రమ పరిసర శామీర్‌పేట మండలం పరిధిలోని శ్రీ షిరిడీసాయి మందిరము, సాయి కుటీరము పొన్నాల గ్రామంలో చతుర్థ వింశతి వార్షికోత్సవ సందర్భంగా దేవస్థానం వారి ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారు ఆలయాల విశిష్టతను గురించి వివరించారు.

ఫిబ్రవరి 18వ తేదీ నాగారం మున్సిపాలిటీ, సత్యనారాయణ కాలనీలోని

శ్రీ రమా సత్యనారాయణ స్వామి, షిరిడీ సాయిబాబా దేవస్థానం తూర్పు రాజగోపురం నిర్మాణానికి శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీవారి కరకమలములచే శాస్త్రోక్తంగా శంకుస్థాపన జరిగినది. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ హిందువుల 500 ఏళ్లనాటి కల సాకారమైన అయోధ్యలో నిర్మించిన భవ్యమైన మందిరములో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ నిర్మించుకోవటం, దుబాయ్‌లో అతి పెద్ద హిందూ దేవాలయాన్ని ప్రారంభించుకోవడం సనాతన ధర్మానికి శుభ పరిణామమని అన్నారు.

ఫిబ్రవరి 27వ తేదీ శ్రీ యాజ్ఞవల్క్య రాజాశ్రమం మండూరు క్షేత్రం, ఏలూరు జిల్లాలో భారతీయ ధర్మ పరిషత్ జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొనడం జరిగింది. దేశం కోసం, ధర్మం కోసం పనిచేయడం కోసం శ్రీ సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారిని భారతీయ ధర్మ పరిషత్ సంస్థకు జాతీయ ఉపాధ్యక్షులుగా మరియు తెలంగాణ అధ్యక్షులుగా నియమించడం జరిగింది.

ఫిబ్రవరి 29వ తేదీ - లక్షలాది కరసేవకుల బలిదానం, 500 సంవత్సరాల పోరాట ఫలితం అయోధ్యలోని భవ్య మందిర నిర్మాణం.

శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ అయిన తర్వాత ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నుండి రామభక్తులు శ్రీబాలరాముని దర్శన అనంతరం రామజన్మభూమిలోని పవిత్రమైన మట్టి మరియు సరయూ నదిలోని పవిత్రజలం తీసుకురావడం జరిగింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ గ్రామంలోని కరసేవకుల స్మారక స్థూపానికి, సరయూ నది జలంతో అభిషేకం చేసి, పవిత్రమైన మట్టిని స్థూపంలో ప్రతిష్ఠించి మరియు శ్రీరాముల వారి ధ్వజం ఎగురవేయడం సాయిదత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ వారి కరకమలము లచే జరిగినది. ఈ కార్యక్రమంలో కరసేవకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.







# ఆశ్రమ భిక్ష పథకం



# అన్నదాన పథకం

శ్రీ సాయీ సేవా సమితి వారి ఆశ్రమం "సాయిధామం"లో అన్నదాన పథకం నడుస్తున్నది. అన్ని దానాల్లోకి అన్నదానం పుణ్యప్రదమని పెద్దలంటారు. శ్రీ సాయికి అన్నదానాలు చాలా ప్రీతిపాత్రం. ఆకలిగొన్న ఎవరికి అన్నం పెట్టినా అది నాకే చెందుతుందని బాబా కంఠోక్తిగా చెప్పారు. తను మాత్రమే వండుకొని తినడం పాపమని గీత చెప్పింది. అన్న దానాన్ని మించిన దానం లేదని అన్ని శాస్త్రాలు అంటున్నాయి. అందుచేత సాయీ భక్తులైన వారికి యీ పుణ్యప్రదమైన అవకాశం కల్పించటం కోసం ఈ పథకం రూపొందింపబడింది.

సభ్యత్వంగా రూ.6,116/-లు చెల్లించిన వారు యీ పథకంలో సభ్యు లవుతారు. సంవత్సరానికొకసారి చొప్పన వారి పేరిట (వారు కోరిన తేదీన గోత్ర నామాలతో) శ్రీ సాయి అర్చన జరుగుతుంది. అదేరోజు వారి పేరిట ఆశ్రమంలో "భిక్ష" ఏర్పాటు చేయబడుతుంది. దీంట్లో వారు స్వయంగా కూడా పాల్గొనవచ్చు. ఆ రోజు వారిపేరు భోజనశాలలో బోర్డు మీద వ్రాయటం ద్వారా ప్రకటితమవుతుంది. సభ్యత్వపు రుసుము **"శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు"** పేరిట చెక్కుల ద్వారాగానీ, వ్యక్తుల ద్వారా గానీ పంపవచ్చు. సత్సంగాలలోనైనా యివ్వవచ్చు. ఈ పథకంలో చేరేవారు తమ చిరునామా, ఎవరి పేరుమీద జరగాలో వారి వివరాలు, చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు కూడా వ్రాసి పంపాలి.

సాయి బంధువులారా,

మీ పిల్లల జన్మదినాల పేరిటో, మీ వివాహ వార్షికోత్సవాల పేరిటో, గతించిపోయిన పెద్దల పేరిటో, మీ గురుదేవుల పేరిటో యీ పథకంలో మీరు భాగస్వాములు కండి. మీకు తెలిసిన వారికి కూడా యీ విషయం తెలియ జేయండి. ఆకొన్నవారి కడుపునింపి శ్రీ సాయినాథుల అపార కరుణకు పాత్రులు కండి. చిరునామా సాయివాణిదే.

**- ధర్మాధికారి, సాయిధామం,**
**శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్,**
**రామలింగంపల్లి పోస్టు, యాదాద్రి భువనగిరి జిల్లా-508126**

# జ్ఞానోదయమే జీవన సాఫల్యము

- వల్లభనేని కుటుంబరావు

## 1.0 నిత్య మానసిక పరివర్తనయే ముక్తికి మార్గం

"క్షమాతీర్థం, తపతీర్థం, తీర్థం మింద్రియ విగ్రహః

సర్వభూత దయాతీర్థం, ధ్యానతీర్థ మనుత్తమమ్॥"

దేనివలన సంసార సాగరము తరింపబడునో, దానికి తీర్థమని పేరు. క్షమయే తీర్థం, తపస్సే తీర్థం, ఇంద్రియ నిగ్రహమే తీర్థం, సమస్త ప్రాణుల యందు కరుణయే తీర్థము. అన్నిటికన్నా ధ్యానం అత్యుత్తమ తీర్థం. ఈ గుణములు లేనిచో తీర్థములలో మునిగిన ప్రయోజనం లేదు.

**"జలస్నానం మలత్యాగం, మంత్ర స్నానం మనశ్శుచి**

**భస్మస్నానం హరేత్తాపం, జ్ఞానస్నానం పరంపదమ్॥"**

నీటిలో స్నానం వలన శరీర మాలిన్యాలు పోతాయి. మంత్రజపం వలన మనసులో మాలిన్యాలు పోతాయి. భస్మం శరీరం అంతటా పూయుట వలన శారీరక తాపం పోతుంది. ఆత్మజ్ఞానం పొందటం వలన ముక్తి లభిస్తుంది.

ఆత్మజ్ఞానియే గృహస్థుని గృహము నుద్దేశించి వెళ్ళునో ఆ గృహస్థుని యొక్క పితృదేవతలందరు పరమగతిని పొందుదురు.

దూడను వెంబడించు ఆవువలె, సదా నారాయణ స్మరణ చేయు భక్తుని భగవంతుడు వెంబడించుచున్నాడని, శివుడు కుమారస్వామికి ఉపదేశించెను. గంగలో చేపలు అనేక జలచరములున్నవి. కొంగ మౌనంతో ధ్యానానుష్టానముతో నుండును, శునకము దిగంబరియై బూడిదతో స్నానం చేయును. వీటికి ఏ విశేషఫలము లభించుట లేదు. జ్ఞానాగ్ని యందు దహించిన కర్మబీజములచే సంసార వృక్షము నశించి





యోగియైనవాడు పునర్జన్మ రహితుడగును.

ఎంతవరకు మనస్సు నశించదో, అంతవరకు వాసనలు నశించవు. ఎంతవరకు వాసనలు నశించవో అంతవరకు మనస్సు నశించదు.

**"పరస్య నింద్యాహై శూన్యం దిక్కారంచ కరోతియం**

**తత్కృతం పాతకం ప్రాప్య, స్వ పుణ్యం ప్రదదాతిసం!"**

ఎవరు ఇతరులను నిందింతురో, చాడీలు చెప్పెదరో, అవమానింతురో అట్టివారు ఇతరులు చేసిన పాపములను తాము పొంది, తాము పొందిన పుణ్యం ఇతరులకిచ్చుదురు.

నేడు సమాజంలో జరుగుతున్నది ఇదే. అయితే ఇద్దరూ తిట్టుకుంటే ఫలితం ఎవరికీ రాదు.

"వైరాగ్యం లేనివానికి జ్ఞానం భారం

శాంతి లేని వానికి మనస్సు భారం

తత్త్వజ్ఞానం లేని వారికి శరీరం భారం".

అన్ని దానములలోకి బ్రహ్మజ్ఞానం దానం అత్యుత్తమం. అంతఃకరణములో గల అవిద్యను తొలగించి, ఆత్మ సాక్షాత్కారము కలిగించునది ఇది ఒక్కటే.

స్నానం చేయునప్పడు, భోజనం చేయునప్పడు, హోమం చేయు నప్పడు, జపం చేయునప్పడు మౌనంగా ఉండవలెను.

ప్రతి మనిషికి అంతర్గత శక్తి ఉంటుంది. దీనినే లేటెంట్ పవర్ అంటారు. దీనిని మనం పట్టించుకోము. మనవల్ల కాదులే అనుకుంటాము. మన ప్రారబ్ధకర్మ మనం ఏమీ చెయ్యలేము అనుకుంటాము. కానీ, స్వామి యోగానందా, వివేకానందా, బుద్ధ భగవానుడు "మనం మన ఇచ్ఛాశక్తి (విల్ పవర్)తో మన ప్రారబ్ధకర్మను అధిగమించవచ్చును" అన్నారు. సైన్స్ పరిశోధనలు కూడా వీటిని నిర్ధారించాయి.

ఒక్క మనిషికి మాత్రమే తన ఆలోచనలను, తన నమ్మకాలను, తన

అనుభవాలను మార్చుకొనే శక్తి ఉంది. మన అవగాహనను (పర్‌పెప్షన్) మనం ఖచ్చితంగా మార్చుకోవచ్చును. మిగతా జీవులకు అంటే మృగాలకు, పక్షులకు ఆ శక్తి లేదు. అవి వాటి ఆలోచనలను మార్చుకోలేవు.

ఇంకా వివరంగా చెప్పాలంటే మన డి.ఎన్.ఏ.ని మనం మార్చుకో వచ్చు. దీని మీద కూడా పరిశోధనలు జరిగాయి.

జ్ఞానం వైపు మనస్సు మళ్ళించి నేర్చుకున్న జ్ఞానం ఆచరణలో పెట్టాలి. సమస్త భావాలనూ శుద్ధిచేయాలి. అపుడు పరిశుద్ధతకు రూపమైన ప్రేమ, కరుణ, దానం, సహనం, క్షమ, సేవాభావం పెంపొందుతాయి. ఉద్రేకం, కోపం, ద్వేషం, అసూయ, భయం సమస్తం ప్రేమ, కరుణ, దానం, సేవ, ఆచరణ ద్వారా పోతాయి. పనిలో ఆనందాన్ని వెదుక్కోవటం ఆధ్యాత్మికత. అన్ని జీవులలో ఒకే దైవం ఉంది. కాబట్టి మానవసేవయే మాధవసేవ. అన్ని కర్మలు బ్రహ్మార్పితం చేయండి.

మనిషి అభిమానరహితంగా వ్యవహరించినపుడు ప్రేమ ఉత్పన్నం అవుతుంది. ఆత్మజ్ఞానం శ్రద్ధ ఉన్నప్పడే సాధ్యం అవుతుంది. కర్మల వల్ల బంధం ఏర్పడుతుంది. ఎలాంటి మమకారం లేకుండా కర్మాచరణం చేస్తే బంధం ఉండదు.

జీవితంలో సరైన పాఠం, సరేలే పోనీలే అనేది - అది కోపమైనా, ద్వేషమైనా, అసూయైనా, అహంకారమైనా సరే.

నోరు తెరచి మాట్లాడేముందు మనస్సు విప్పి చూడు. నీ ప్రశాంతత అనేది ఇతరులను జడ్జి చేయటం వలన రాదు. క్షమించటం వలన వస్తుంది. సంతోషంగా జీవించటం అంటే అన్నిటిని పొందటం కాదు, ఉన్న దానితో తృప్తిగా జీవించటం. ఎల్లప్పడు మంచి ఆలోచనలు మనస్సుకు పంపించాలి. గొప్ప మనస్సుకు ఆశయం ఉంటుంది. చిన్న మనస్సుకు కోరికలుంటాయి.

**(సశేషం)**





బాలవాణి

# బలవంతుడి భంగపాటు

**- శుకవాణి**

అవి పాండవులు, కౌరవుల చేతిలో జూదంలో ఓడిపోయి వనవాసం చేస్తున్న రోజులు. ఒకరోజు వనవిహారం చేస్తున్న ద్రౌపదీ దేవికి గాలిలో కొట్టుకు వచ్చి ఒక పుష్పం దొరికింది. సుగంధాలు వెదజిమ్ముతూ ఎంతో సుందరంగా ఉన్న ఆ సౌగంధిక పుష్పంలాంటివి ఇంకా చాలా దొరికితే బావుండుననిపించింది ద్రౌపదికి. పాండవులందరిలో మిక్కిలి బలవంతుడూ, ఎంత కష్టానికైనా ఓర్వగలవాడూ భీమసేనుడు. అంచేత ద్రౌపది ఆ సౌగంధిక పుష్పం భీమునికి చూపించి, "నాకిలాంటి పూలు చాలా కావాలి. తెచ్చిపెట్టరూ!" అని అడిగింది. భీముడిది చిన్న చిన్న విషయాలకు కూడా పొంగిపోయే స్వభావం. మిగిలిన పాండవులందరినీ వదిలి ద్రౌపది తననే పూలు తెమ్మని కోరిందనగానే అతడు చాలా సంతో షించాడు. "ఓహ్! అదెంతపని దేవీ! చిటికెలో తేనూ! ఇదుగో ఇప్పడే వెడుతున్నా" అంటూ బయలుదేరాడు.

అది గంధర్వుల నివాసప్రాంతం. ఆ కొండల మధ్య ఒక చక్కని కదళీ వనం-అంటే అరటితోట ఉంది. ఆ తోటకవతల ఒక నిండైన కొలనుంది. ఆ కొలనులో ఉంటాయి సౌగంధిక పుష్పాలు. భీముడికి అవెక్కడుంటాయో తెలియదు. వెతుక్కుంటూ వస్తున్నాడు. అక్కడి కదళీవనంలో ఉన్నాడు. ఆంజనేయస్వామి, మహాగర్వంతో నడుస్తూ వస్తున్న భీమసేనుడిని చూచా డాయన భీముడు వాయుపుత్రుడు. ఆంజనేయుడూ వాయుపుత్రుడే. కనుక వాళ్ళిద్దరూ అన్నదమ్ములు. తన తమ్ముడు ఎందుకు వస్తున్నాడో దివ్యదృష్టితో తెలుసుకున్నాడు ఆంజనేయుడు. భీమునిలో పొంగుతున్న అహంకారాన్ని ఆయన గ్రహించాడు. అతడు వెడుతున్నదేమో గంధర్వుల చోటికి. తేవాలనుకున్నవేమో వారి కొలనులోని పుష్పాలను. ఒకవేళ వారికి

కోపం వస్తే యీ భీముడు వారినెదిరించి గెలవగలడా? ఇతనిదీ ఉత్తి అహంకారమేనా? నిజంగా శక్తి ఉన్నదా? - పరీక్షించాలనుకున్నాడు ఆంజనేయుడు. మెల్లగా తోటదాటి బాటలోకి వచ్చి నట్టనడుమన తోక దారి కడ్డంగా పడవేసి కూర్చున్నాడు.

భీముడు అతనికి దగ్గరగా వచ్చాడు. ఆంజనేయుడి తోక దారికి అడ్డంగా ఉంది. దాటిపోవడం పాపం. అంచేత అతడు "ఏయ్, ముసలి కోతీ! నీ తోక పక్కకు తియ్యి" అన్నాడు. హనుమంతుడు మెల్లగా కళ్లు తెరిచి, "ఏమిటి నాయనా?" అన్నాడు వణుకుతున్న గొంతుతో, "దారికి అడ్డంగా యీ తోక తియ్యమంటున్నాను" అన్నాడు భీముడు కాస్త విసుగ్గా. హనుమంతుడు కొంచెం కదిలే ప్రయత్నం చేసి, "చూస్తున్నావుగా నాయనా! ముసలివాడిని. గభాల్న కదలమంటే నావల్ల కావటం లేదు. నువ్వు చూస్తే యువకుడివి. పైగా మంచి బలవంతుడిలాగా కన్పిస్తున్నావు. కాస్త నా తోక నువ్వే పక్కకు జరుపు నాయనా!" అన్నాడు కాస్త ఆయాసపడుతూ.

భీముడికి కొంచెం జాలివేసింది ఆంజనేయుడి మీద. పోనీలే- ముసలి కోతి అడుగుతోంది గదా-సాయం చేద్దామనుకున్నాడు. పైగా తానేమో తొందరగా వెళ్ళి సౌగంధిక పుష్పాలు తేవాలాయె! అంచేత అతడు కాస్త వంగి ఎడమచేతిలో ఆంజనేయుని తోక కదిలిద్దామనుకున్నాడు. అరె! పెద్దపెద్ద కొండనైనా అతి తేలికగా ఎత్తగలిగే చేతికి ఒక ముసలికోతి తోక కదలటం లేదేమిటీ!" ఆశ్చర్యపోయాడు భీముడు.

కుడిచేతిలోని గద ఎడమ చేతిలోకి మార్చుకొని, కుడిచేత్తో లేప బోయాడు. ఊహూ అస్సలు కదలందే! భీముడికింకా ఆశ్చర్యం వేసింది. ఆంజనేయుడి వైపు చూచాడు. ఆయన పెదవుల మీదా, కళ్లలోనూ చిన్న దొంగనవ్వు కదిలింది. అది చూడగానే భీముడికి కోపం వచ్చింది. గద క్రింద పడేసి రెండు చేతులతోనూ బలంగా తోకలాగే ప్రయత్నం చేసాడు. తన బలం ఒకసారి గుర్తుచేసుకున్నాడు. హేమాహేమీలను కుస్తీలలో చిత్తు





చేసిన తన చేతులు చూచుకున్నాడు. "ఇంతటి బలవంతుడిని-నాకీ వెధవ కోతి తోక పరీక్ష పెట్టడమా!" అని ఆవేశపడ్డాడు. తన బలం మొత్తం ఉపయోగించి ప్రయత్నించాడు. ప్చ్-ఏమీ లాభం లేకపోయింది. ఒళ్లంతా చెమటలు పట్టి కారిపోతున్నాయి. ఆయాసం వచ్చిందే తప్ప-తోక రవ్వంతైనా కదలలేదు. ఇంకప్పటికి భీముడికి అనుమానం వచ్చింది.

అసలిది నిజంగా కోతేనా! మామూలు కోతి తోక ఇంత బలంగా, బరువుగా ఉండదు గదా! అంచేత యీ కోతి తనను పరీక్షించటం కోసం యీ రూపంలో వచ్చిన మహానుభావుడెవరో అయి ఉండాలి. ఈ ఆలోచన రాగానే భీమసేనుడిలోని గర్వం అంతా చచ్చిపోయింది. వెంటనే ఆంజనేయుడి పాదాలంటి నమస్కరించాడు.

"స్వామీ! నేను పాండవులలో రెండవవాడిని-నన్ను భీమసేనుడంటారు. వాయుదేవుడి వరప్రసాదాన జన్మించినవాడిని. నావంటి బలశాలిని మీ తోక రవంత కూడా కదిలించలేకపోయానంటే తమరెవరో మహాత్ములై ఉండాలి. నన్ను మన్నించి తమ నామధేయం సెలవిస్తారా!" అన్నాడు. ఆంజనేయుడు భీముడు చూపిన వినయానికి సంతోషించాడు. వెంటనే లేచి నిలబడి భీముడిని కౌగిలించుకున్నాడు.

"నాయనా! నేను వాయుపుత్రుడనైన హనుమంతుడనూ. ఆ వరుసన నీకు అన్నగారినవుతాను. నీ బలపరాక్రమాలను గూర్చి విన్నాను. నీవిప్పుడు సౌగంధిక పుష్పం కోసం వెడుతున్నావని గ్రహించి, నీకో పరీక్ష పెట్టాను" అన్నాడు.

భీముడు కాస్త సిగ్గుపడి తలవంచుకున్నాడు. "మీ పరీక్షలో నేను ఓడిపోయాను" అన్నాడు. ఆంజనేయుడు అతని భుజం మీద తట్టి, "ఫర్వా లేదు నాయనా! ఇందులో నీవు ఓడిపోవటమూ, సిగ్గుపడవలసి రావడమూ ఏమీ లేదు. నీవు గంధర్వులను గెలవగలవా లేదా అన్నది నా

**(మిగతా 22వ పేజీలో)**